ప్రజాశక్తి
సోమవారం 15 ఏప్రిల్ 2024
5
శ్రీకాకుళం



ముగిసిన టెక్ని వెర్స్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఈనెల 12 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన టెక్ని వెర్స్ టెక్నికల్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసినట్లు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకట గోపాలధన బాలాజీ తెలిపారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫెస్ట్‌లో 90 ప్రాజెక్టు వర్క్స్, 50 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు, కోర్సుల ఉపయోగాలపై అవగాహన కలిగించడానికి ఫెస్ట్ దోహదపడిందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి పరిపాలనాధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేటకు విరామం

- నేటి నుంచి 61 రోజుల పాటు చేపల వేటపై నిషేధం
- పెండింగ్‌లో 800 మందికి పరిహారం
- భృతి చెల్లింపునకు సర్వేపై ఇంకా రాని మార్గదర్శకాలు

సముద్రంలో చేపల వేటపై సోమవారం నుంచి నిషేధం అమలు కానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేయనుంది. ఈ సమయాల్లో వేట సాగిస్తే మత్స్య సంపద దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా వేటకు విరామాన్ని ప్రకటిస్తూ వస్తోంది. చేపల వేటకు దూరంగా ఉంటున్న మత్స్యకారులకు ప్రభుత్వం 61 రోజుల కాలానికి రూ.10 వేలు భృతి చెల్లింపునకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పరిహారం చెల్లింపునకు అర్హులైన వారిని గుర్తించేందుకు గతేడాది 17వ తేదీ నుంచే సర్వే చేపట్టగా, ఈ ఏడాది వాటికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడలేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



వేట నిషేధ భృతిని 2018 వరకు మోటారు బోట్లకు పరిమితం చేయగా, రెండేళ్లుగా తెప్పలపై చేపల వేట సాగిస్తున్న వారికీ ప్రభుత్వం భృతిని వర్తింపజేసింది. జిల్లాలోని 11 మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. చేపల వేట ప్రధాన వృత్తిగా సుమారు 25 వేల కుటుంబాలు బతుకుతున్నాయి. వేట నిషేధ కాలపు పరిహారాన్ని ప్రభుత్వం కొందరికే పరిమితం చేస్తోంది. పడవలో గరిష్టంగా పది మంది వరకు చేపల వేటకు వెళ్తారు. మోటరైజ్డ్ బోట్లపై వేట సాగించిన వారిలో ఆరుగురికి, సంప్రదాయ తెప్పలపై వేట చేస్తున్న వారిలో ముగ్గురికి మాత్రమే సాయాన్ని అందిస్తోంది. దీంతో మిగిలిన మత్స్యకార కుటుంబాలు సాయం పొందలేకపోతున్నాయి. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు వేటకు వెళ్తున్నా, అందులో ఒక్కరికే డబ్బులు అందిస్తోంది. చేపల వేట నిషేధంతో మత్స్యకార మహిళలు చేపలు అమ్ముకోవడానికి అవకాశం లేకపోవడంతో వారికీ ఉపాధి లేకుండా పోయింది. ప్రభుత్వం ఇచ్చిన సాయం డబ్బులనే అందరూ కలిసి పంచుకుంటున్న పరిస్థితి ఉంది.

పెండింగ్‌లో 800 మందికి పరిహారం

జిల్లాలో గతేడాది ఏప్రిల్ 17న సర్వే చేసి 15,281 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో సుమారు 800 మంది మత్స్యకారులకు నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. బ్యాంకు ఖాతాలు మనుగడలో లేకపోవడం, ఇకెవైసి వంటి సాంకేతిక సమస్యలతో డబ్బులు ఆగిపోయాయి. తొలుత 1100 మంది మత్స్యకారుల వరకు డబ్బులు రాలేదని, సాంకేతిక సమస్యలు పరిష్కరించడంతో 300 మందికి డబ్బులు జమ అయ్యాయని అధికారులు చెప్తున్నారు.

సర్వేపై వెలువడని మార్గదర్శకాలు

చేపల వేటపై నిషేధం నేపథ్యంలో అర్హులైన మత్స్యకారులను గుర్తించేందుకు చేపట్టే సర్వేపై ఇంకా మార్గదర్శకాలు రాలేదు. గతేడాది 17వ తేదీన జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఒకేసారి సర్వే చేపట్టారు. మత్స్యకారుల నుంచి బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లు తదితర వివరాలను సేకరించారు. బోటుకు పైభాగంలో పసుపు, కింది భాగంలో నీలం రంగు వేయాలని నిబంధన విధించారు. రిజిస్ట్రేషన్ అయిన బోట్లకే పరిహారం చెల్లించారు. వివరాలను క్రోడీకరించి అర్హులైన వారి జాబితాలను సిద్ధం చేసి, ఏప్రిల్ చివరి వారంలో తుది జాబితా ప్రదర్శించారు. మే పదో తేదీన ప్రభుత్వం నగదు జమ చేసింది. ఈ ఏడాది వీటికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడకపోవడంతో పరిహారం ఎప్పుడు అందుతుందోనన్న ఆందోళన మత్స్యకారుల్లో నెలకొంది.

నిషేధం ఉత్తర్వులు ధిక్కరిస్తే జరిమానా

చేపల వేటపై ప్రభుత్వం ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిషేధం విధించింది. మత్స్య సంపద వృద్ధికి మత్స్యకారులు సహకరించాలి. నిషేధిత సమయంలో వేటకు వెళ్లిన వారికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయం నిలిపివేస్తాం. దీంతోపాటు నిషేధ ఉత్తర్వులను ధిక్కరిస్తే రూ.2,500 జరిమానా విధిస్తాం. సముద్రంలో పట్టిన చేపలను వేలం వేస్తాం. పడవలు, వలలు సీజ్ చేస్తాం.

- పి.వి శ్రీనివాసరావు, మత్స్యశాఖ ఉపసంచాలకులు


వలస కార్మికులు వెనక్కి

జిల్లాలో ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వెళ్లిన జిల్లాకు చెందిన మత్స్యకారులు చేపల వేట నిషేధంతో తమ స్వస్థలాలకు వస్తున్నారు. చేపల వేట ప్రధానంగా సాగే గుజరాత్‌లోని వీరావళి, చెన్నై తదితర ప్రాంతాలకు జిల్లా నుంచి మత్స్యకారులు పెద్దసంఖ్యలో వలస వెళ్తుంటారు. 61 రోజులు వేట నిషేధం అమల్లో ఉండడంతో గ్రామాలకు చేరుకుంటున్నారు.

నేడు చంద్రబాబు రాక

పలాసలో 'ప్రజాగళం'

ప్రజాశక్తి - పలాస



ప్రజాగళం యాత్రలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం పలాస రానున్నారు. సాయంత్రం 5.15 గంటలకు చంద్రబాబు ప్రత్యేక విమానంలో పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 5.20 గంటలకు హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక బస్సులో పర్యటించి 5.30 గంటలకు పలాస ఇందిరాగాంధీ చౌక్‌కు చేరుకుంటారు. సాయంత్రం ఆరు నుంచి రాత్రి 7.30 గంటల వరకు బహిరంగ సభలో మాట్లాడతారు. 7.40 గంటలకు ఇందిరాచౌక్ నుంచి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఇంటికి ప్రత్యేక బస్సులో చేరుకుని అక్కడ రాత్రి బస చేస్తారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో హెలీప్యాడ్, ఇందిరాచౌక్ వద్ద సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులతో, ఆ తర్వాత వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, జనసేన నాయకులు వి.దుర్గారావు, బిజెపి నాయకులు పి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

నిర్వాసిత కాలనీ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో మూలపేట నిర్వాసితులకు నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ పనులు వేగవంతం చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. రెవెన్యూ, ఆర్ అండ్ ఆర్, సర్వే, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్, ఫ్లాట్లు గుర్తింపు, మంచినీటి సరఫరా పైపులైను నిర్మాణ పనులు పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యత పెంచి నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ సత్యనారాయణ, విఆర్ఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవితం నేటి తరానికి స్ఫూర్తి

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఎచ్చెర్ల, రణస్థలం

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, కలెక్టరెట్ ఎఒ కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌పి జి.ఆర్ రాధిక పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. అంబేద్కర్ అడుగుజాడల్లో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న డిఆర్ఒ తదితరులు


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సిఐటియు నాయకులు

రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి దాని మిత్రపక్షాలను ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల కాలనీ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎన్.రమణ, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కృషి అనిర్వచనీయం

నవభారత నిర్మాణం కోసం, ప్రజాస్వామ్యం కోసం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. రణస్థలంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దుర్భరమైన వివక్షను, అవమానాలను ఎదుర్కొన్న అంబేద్కర్ కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను అంబేద్కర్ స్ఫూర్తితో నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, వీర్రాజు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు బిజెపి తూట్లు

- 'ఇండియా' వేదిక అభ్యర్థులను గెలిపించాలి
- ఎఐసిసి కార్యదర్శి మనోజ్ చౌహాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశ సమగ్రతకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఎఐసిసి కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మనోజ్ చౌహాన్ విమర్శించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు, పార్టీ మండల, అనుబంధ సంఘాల బాధ్యులతో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రాభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ వల్లే సాధ్యమన్నారు. బిజెపి దానికి మద్దతు ఇస్తున్న పార్టీల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజానీకాన్ని చైతన్యపరిచి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తొమ్మిది గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేకహోదా, పేద కుటుంబంలోని మహిళకు ఏడాదికి రూ.లక్ష ఆర్థికసాయం, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.ఆరు వేల పెన్షన్, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య, ఇల్లు లేని నిరుపేదలకు రూ.ఐదు లక్షలతో ఇళ్ల నిర్మాణం, రైతు పెట్టుబడిపై 50శాతం లాభంతో మద్దతు ధర వంటి గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఈ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని వైసిపి, టిడిపి తాకట్టు పెట్టాయని విమర్శించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు ఉన్నారని, వారిని తిరిగి పార్టీ కోసం పనిచేసేలా చైతన్యం చేయాలన్నారు. డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షత వహించిన సమావేశంలో అసెంబ్లీ అభ్యర్థులు మజ్జి త్రినాథ్‌బాబు, పైడి నాగభూషణరావు, సనపల అన్నాజీరావు, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, మంత్రి నరసింహమూర్తి, కె.వెంకట్రావు, సేవాదళ్ జాతీయ సహాయకార్యదర్శి బమ్మిడి గంగాధరరావు, డిసిసి అధికార ప్రతినిధి చింతాడ దిలీప్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామారావు, పిసిసి ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోజ్ చౌహాన్

ఓటమి భయంతోనే జగన్‌పై దాడి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ప్రతిపక్షాలు దాడికి పాల్పడ్డాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. జగన్‌పై దాడిని ఖండిస్తూ మున్సిపాల్టీ పరిధిలోని ఊసవానిపేట జంక్షన్ వద్ద వైసిపి శ్రేణులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోలేక ప్రతిపక్షాలు దాడులను ప్రోత్సహిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాయని, ఇది హేయమైన చర్య అని అన్నారు. భౌతిక దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని ప్రజాస్వామ్య స్ఫూర్తితో న్యాయం, ధర్మానిదే విజయం కావాలి తప్ప.. వ్యక్తులపై దాడులకు దిగటం సిగ్గుచేటు అని అన్నారు. అధికార దాహానికి వ్యవస్థను బలి చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపైనా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా దాడులకు దిగుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. దాడులను ప్రోత్సహిస్తున్న పార్టీల గుర్తింపును ఎన్నికల సంఘం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుటిల రాజకీయాలకు కేంద్రంగా నిలుస్తున్న చంద్రబాబుతో జత కట్టడం ద్వారా కూటమిలో మిగిలిన పార్టీలు ప్రజల్లో ఉనికిని కోల్పోయాయన్నారు. ప్రజాక్షేత్రంలో కూటమికి తగిన పరాభవం తప్పదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, డి.శ్యామలరావు, బి.చిన్నంనాయుడు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయి

నరసన్నపేట : తెలుగుదేశం పార్టీకి అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయని.. అందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జగన్‌పై దాడిని నిరసిస్తూ నరసన్నపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, వైసిపి మండల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగన్‌పై దాడిని నిరసిస్తూ ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, నరేష్ కుమార్ అగర్వాలా తదితరులు నల్లబ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిలక రాజ్యలక్ష్మి, ఉప్పాడ నారాయణమ్మ, సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : సిఎం జగన్మోహన్ రెడ్డిపై దాడి అమానుష చర్య అని సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంత్‌రెడ్డి ఖండించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేమంతా సిద్ధం యాత్రకు వస్తున్న అపూర్వ ప్రజాదరణను ఓర్వలేక దాడి చేసిన ప్రతిపక్షాలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్తారన్నారు.


నరసన్నపేట : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కృష్ణదాస్, తిలక్ తదితరులు


ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి నాయకులు


నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కంచిలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించకుండా, కనీస వేతనాలు అమలు చేయకుండా పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు ఎటువంటి మార్పులు లేవన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న పరిస్థితి ఉందన్నారు. వంట సమయంలో ప్రమాదం సంభవిస్తే కనీసం పట్టించుకునే నాథుడే లేరన్నారు. రూ.10 వేలు కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలన్నారు. మెనూ ఛార్జీలకు రూ.20 ఇవ్వాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలన్నారు. సెలవులు ఇవ్వాలని, మెటర్నిటీ బెనిఫిట్ కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. స్కూల్‌లో మౌలిక సదుపాయాలైన మంచినీరు, వంటషెడ్, వంటపాత్రలు తదితర సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.కౌసల్య, జి.దమయంతి, జయలక్ష్మి, తులసి, నారాయణమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బరంపురం సబ్ కలెక్టర్ దీనా దస్తగీర్

సమన్వయంతో పనిచేద్దాం

బరంపురం సబ్ కలెక్టర్ దీనా దస్తగీర్

ప్రజాశక్తి - బరంపురం, ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా-ఒడిశా అధికారులు సమన్వయంతో పనిచేయాలని బరంపురం సబ్ కలెక్టర్ దీనా దస్తగీర్ అన్నారు. బరంపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, మద్యం, నగదు, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు సమాచారం సేకరణ, సంయుక్త దాడులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, సరిహద్దు ప్రాంతంలో డబుల్ ఓటర్లు తదితర అంశాలపై సమీక్షించారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువులు అక్రమ రవాణా కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఇరు రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కళింగాంధ్ర పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు, వేమన కవితా నిలయం గౌరవాధ్యక్షులు సురంగి మోహనరావు, తపస్వి మనోహరం నిర్వాహకులు తేజస్విని చేతుల మీదుగా నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కళింగాంధ్ర పుస్తకావిష్కరణను ఆదివారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర కవితల పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఈవేమన కవితా నిలయం అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీ (ఈ-వేమన), బి.కుమార్ రాజు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

సేఫ్ పలాసగా మార్చుతా

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యాపారులపై దాడులు, వైద్యుల భూములకు రక్షణ లేకుండా పోయిందని తనకు ఒక్క అవకాశం ఇస్తే సేఫ్ పలాస సేఫ్ పలాసగా మార్చుతానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. కాశీబుగ్గలో వైద్యులు కళ్యాణ మండపంలో ఆదివారం కళింగ వైశ్యులతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కెటి రోడ్డు విస్తరణ పనులు చేయాల్సి ఉండగా వ్యాపారులు రోడ్డున పడతారని, వారికి ఇబ్బందులు పెట్టకూడదనే ఉద్దేశంతో విస్తరణ పనులు చేయలేదన్నారు. గౌతు శిరీష మాట్లాడుతూ పలాసలో ఇళ్లు అద్దెకు ఇస్తామని చెప్పిన ఒక వ్యాపారి మంత్రి సీదిరి బెదిరించడంతో ఇళ్లు అద్దెకు ఇవ్వలేని పరిస్థితిలో పలాస ఉందన్నారు. ఆయన వ్యాపారులను తప్పు పట్టడం లేదని, మంత్రి అరాచకాలు ఏలా ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో బోయిన గోవిందరాజులు, కోరాడ హరగోపాల్, పివి రమణ, కోరాడ రమేష్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవి శంకర్ గుప్తా, శాసనపురి మురళీ కృష్ణ, మల్లా రావువేంద్ర పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హరి బెహరా

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి - కవిటి

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా పిలుపునిచ్చారు. కవిటి గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక మత్స్యకారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 5ఏళ్లలో వైసిపి ప్రభుత్వం మత్స్యకారులకు చేసిందేమీ శూన్యమన్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల బతుకులు మారాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. జిఒ నెంబర్ 217 పేరుతో వైసిపి ప్రభుత్వం మత్స్యకారుల జీవితాలతో చెలగాటం ఆడిందని, కనీసం వలలు, ఇంధనం, బోట్లు వంటి విషయాల్లో సబ్సిడీలు ఇచ్చిన దాఖలాలు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో బడే దేవరాజు, దుర్యోధన, చిట్టి బెహరా, త్రినాథ్ బెహరా, కుర్మారావు, ప్రవీణ్, రాజు బెహరా పాల్గొన్నారు.


రెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాంధి

గ్రామాల్లో 'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని దల్లిపేట, రెడ్డిపేటలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ జోరుగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో సమస్యలను పక్కన పెట్టి అధినేతల దోచుకుంటున్న కుటుంబ రాజకీయాలను కుటుంబ రాజకీయాలను అంతం చేయాలని అన్నారు. ఇంటింటా తిరుగుతూ నియోజకవర్గంలను అన్ని రంగాల్లో అభివృద్ధికి తనకు ఒక్క చాన్స్ ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పోతురాజు సూర్యారావు, చంద్రశేఖర్, పిన్నింటి అప్పలనాయుడు, చింతాడ శివ, కోరుకొండ సాయికుమార్ ఉన్నారు.



వసుంధర చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అధికారులు

చెక్‌పోస్టు తనిఖీ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని వసుంధర వద్ద సరిహద్దు చెక్‌పోస్టును పోలీస్, ఎస్ఇబి అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. సరిహద్దుల్లో మరింత అప్రమత్తంగా ఉండి తనిఖీ నిర్వహించాలని వారు సూచించారు. తనిఖీల్లో విశాఖపట్నంకు చెందిన డిసిఎస్ఇబి రామచంద్రమూర్తి, మంగళగిరి ఎసి హనుమంతరావు, టెక్కలి ఎక్సైజ్ సిఐ జి.ఎస్ రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు అంబేద్కర్


రణస్థలం : అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్


పలాస : అంబేద్కర్ విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న గిరిజన నాయకులు


నరసన్నపేట : పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాజనీతిజ్ఞుడు అంబేద్కర్ అని స్పీకర్ తమ్మినేని సీతారాం కొనియాడారు. ఆదివారం అంబేద్కర్ 133 జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి సమాజంలో ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవితకాలం చేసిన పోరాటం మరువ లేనిదన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా భారతీయ సమాజంలో పేరుగాంచారన్నారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కులకోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడుగా అంబేద్కర్‌ను అభివర్ణించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బోర చిన్నం నాయుడు, పొడుగు శ్రీను, దుంపల చిరంజీవి, ముత్తా విజయ్, రవికాంత్ పాల్గొన్నారు.

అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆర్‌టిసి బస్‌స్టేషన్ వద్ద ఉన్న విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, బివి రమణమూర్తి, బోనెల అప్పారావు ఉన్నారు.

రణస్థలం: మండల కేంద్రం జెఆర్.పురం పంచాయతీలో అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు పౌలు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్ రాథో, రాజు మద్ది, పౌలు పూండి, దేవకుమార్ రాథో, దళిత హక్కుల నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి, చీపురుపల్లి, నడసంద్ర, మెళియాపుట్టి తదితర గ్రామాలతో పాటు స్థానిక శాఖ గ్రంథాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సుజాత, పద్మారావు, రామచంద్రరావు, సుందరమ్మ, నారాయణ, తిరుపతిరావు, సింహాచలం, సుధారాణి, రవి పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, జనసేన నాయకులు డాక్టర్ వి దుర్గారావు పాల్గొన్నారు. అలాగే కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజన నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయుకులు, గిరిజన జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, మండల అధ్యక్షులు పెద్దింటి ఈశ్వరరావు పాల్గొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షులు పిలక కృష్ణారావు, అధ్యక్షులు తెప్ప పాపారావు, న్యాయ సలహాదారులు జిఎంఎస్ అనిల్ రాజు పాల్గొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, ఎన్ ఢిల్లేశ్వరి, జె భాగ్యలక్ష్మి, డి సోమయ్య పాల్గొన్నారు.

కవిటి: మండలం బెజ్జిపుట్టుగలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాతల సహకారంతో స్వర్గీయ బొర్ర అప్పలరాజు మాస్టారి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి పదేళ్లు అయిన సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని కవిటి, బొరివంక, డిజి పుట్టుగ, కాజూరు, జగతి, నెలవంక గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పోలాకి: అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ పాల్గొన్నారు.

నరసన్నపేట: పట్టణములో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిఆంధ్రవీధిలో సిపిఎం నాయకులు నంబూరి షన్ముఖరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, గ్రామపెద్దలు యెర్ర వెంకటరావు, డి.వైకుంఠరావు, వై.శివరావు, పి.రామారావు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని నందిగాం, పెంట ఊరు, పెద్ద తామరపల్లి, సింగపురం, హరిదాసుపురం తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు టి.తిరుపతిరావు, నందిగాం సర్పంచ్ ప్రతినిధి జయరామ్, మాజీ జెడ్‌పిటిసి బాలకృష్ణారావు, లోకనాథం, విష్ణు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కారిగూడ పంచాయతీలో ఎగువదొండ మానుగూడలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గురండిలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. నాలుగు రోడ్ల కూడలిలో మాల మహానాడు ఆధ్వర్యంలో జమ్మయ్య, గుమ్మయ్య, ప్రసాద్, తిరుపతి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

పొందూరు: పొందూరు మార్కెట్ కమిటీ ఆవరణలో ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డా.సునీల్‌కుమార్, సెక్రటరీ రేగడి గవరరాజు, ట్రెజరర్ పట్నాన రాజారావు, ఉపాధ్యక్షుడు సీర రాము, మన్నాన వెంకటరావు, పోతయ్య, విజయ్, జోలీ పాల్గొన్నారు. అలాగే మండలంలోని లోలుగు కాలనీలో డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద విగ్రహానికి మండల యూటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల శాఖాధ్యక్షులు గణపతిరావు, కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య, పాలవలస దర్మారావు, డొంకాన పాపారావు పాల్గొన్నారు. ప్రజా చైతన్య కళాసమితిలో ఎంఇఒలు మల్లారెడ్డి పద్మనాభం, డి.ధాశరధి, సీనియర్ ఉపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, అనిశెట్టి చిట్టెన్న, పి.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు. గ్రంథాలయంలో శాఖాధికారిణి బి.రూపావతి, విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, మట్ట లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఎస్‌సి బాలుర వసతిగృహంలో సమత సైనిక్‌దళ్ కార్యదర్శి చల్లా రామారావు, హేమసుందర్ పాల్గొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు యడ్ల గోపి, సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, పాల పోలారావు, అక్కురాడ శ్రీనివాసరావు, చిట్టి సింహచలం పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, డాక్టర్ కిల్లి కృపారాణి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి కార్యాలయంలో మండలశాఖ అధ్యక్షులు బగాది శేషగిరి, ఎస్‌సిసెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్టపురుషోత్తం, హనుమంతు రామారావు, బెహరా కాళీ, బసవల అప్పలస్వామి పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్, కొత్తూరు హరి, చిరంజీవి, కుమారస్వామి, కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: దళిత సంఘ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను నిర్వహించారు. సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి హరిబాబు, దళిత నాయకులు ఎడ్ల ఈశ్వరరావు, గుర్రాలు చిన్న బాబు, ఇల్లాకులు సూర్యప్రకాష్, రావాడ వెంకటరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ల ర్పించారు.


ఆమదాలవలస : పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం


టెక్కలి రూరల్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దువ్వాడ



ఎచ్చెర్ల : అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్

బూర్జ: మండలంలోని పెద్ద పేట గ్రామంలో ఆర్ప్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలను సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమములో సహాయకులు టి. వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ కె.మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్. డా. అసిరి నాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, జాతీయ సేవా పథకం కో-ఆర్డినేటర్ పెద్దింటి ముకుంధరావు పాల్గొన్నారు.

ఎంపిఆర్ లా కాలేజీ సెమినార్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ మోషే అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు నూక సత్యరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల విప్ బొడ్డు అప్పన్న, కాళ్ళ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆదివారం పేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజెబాబు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

జన విజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటిఎఫ్)ల ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ కూడలిలో విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి రవికుమార్, జిల్లా కార్యదర్శులు పి సూర్య ప్రకాష్ ,గొంటి సురేష్, కోదండరావు , వెంకటేష్, వెంకటరావు, పెంట రాజు, రవీంద్ర నివాళ్లర్పించారు.

ఆంధ్రప్రదేశ్ బిసి న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు, డాక్టర్ ఎన్ని సూర్యారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


మొరాయించిన ఆర్‌టిసి బస్సు

బూర్జ: కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. దూర ప్రాంతాలకు ప్రయాణం కోసం ప్రజలు ఆర్‌టిసి బస్సులను ఆశ్రయించగా అది కాస్త మార్గమధ్యంలో రిపేర్లతో ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు మండలంలోని లచ్చయ్యపేట గ్రామం వద్ద మరమ్మతులకు గురవ్వడంతో ఆగిపోయింది. దీంతో స్టార్ట్ కావడానికి మొరాయిం చడంతో ప్రయాణికులు బస్సు దిగి బస్సులు తోయడం ప్రారంభించారు. అయినప్పటికీ బస్సు స్టార్ట్ అవ్వకపోవడంతో చేసేది ఏమీ లేక వెనుక వచ్చిన బస్సును ఆశ్రయించారు. ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం అందజేస్తామని సురక్షితమని ప్రకటనలు గుప్పించిన అధికారులు కాలం చెల్లిన బస్సులు నడుపుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని ప్రయాణికులు బహిరంగ విమర్శలు గుప్పించారు.


బస్సును తోస్తున్న ప్రయాణికులు

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం


ఆమదాలవలస : పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న సీతారాం


కొత్తూరు : ప్రచారం చేస్తున్న రెడ్డి శాంతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలో మూడవ వార్డు ఊసవానిపేటలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బోర చిన్నం నాయుడు, పొడుగు శ్రీను, దుంపల చిరంజీవి, ముత్తా విజయ్, అత్తులూరి రవికాంత్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం మలకాంలో వైసిపి అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రతిఒక్కరు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్, ఎంపిటిసి ప్రతినిధి వడగ మోహనరావు, వైసిపి నాయకులు వెంకట్రావు, బండారు జై ప్రతాప్ కుమార్, రేగిడి లక్ష్మి, గాడు నాగరాజు పాల్గొన్నారు.

పలాస: అభివృద్ధి సంక్షేమం వైసిపి విధానమని పశు సంవర్ధకశాఖామంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్వర్యంలో 24, 31, 1, 2 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో తన ప్రచార రథం నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఏ ఇంటికయినా ఒక్క రూపాయి సహాయం అందిందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, బడగల సుజాత, దున్న నిర్మల, దున్న సత్యం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పురుషోత్తం పురం గ్రామంలో వైసిపి నాయకులు ప్రచారం చేశారు. ప్రచార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షులు బలివాడ ప్రకాశరావు పట్నాయక్, సుబ్బు ప్రేమ్ కుమార్, చాట్ల తిరుపతి, ప్రచార కమిటీ అధ్యక్షులు తాడి ఆది రెడ్డి, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ అధ్యక్షులు లోకేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని కారిగూడ పంచాయతీ ఎగువ దొండమాను గూడ, దిగువ దొండమనుగూడ, బాంద్రాగూడ గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గెలిపించాలని గిరిజనులను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్య నారాయణ, నాయకులు తోట నందకుమార్, కిరణ్ కుమార్, చక్రపాణి, బి.శ్రీను, సర్పంచ్ సాధుబాబు పాల్గొన్నారు.


పోలాకి: పేదల పక్షాన పోరాడుతున్న జగన్మోహన్ రెడ్డిపై కూటమి పెత్తందారులు విసిరిన రాళ్ళే రేపటి తెలుగుదేశం పార్టీ సమాధి రాళ్లుగా మారుతాయని రాష్ట్ర బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, ధర్మాన రామలింగం అన్నారు. మండలం రెహమాన్ పురం పంచాయతీలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, కణితి కృష్ణారావు, ఎంపిపిలు తాతారావు పాల్గొన్నారు.


కవిటి: మండలం సహలాలపుట్టుగ గ్రామంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ వైసిపి శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిని కలియతిరిగి రాబోయే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్ఛాపురం సయ్యద్ ఖాన్ చెరువు వద్ద గల ట్రాలీ రిక్షా యూనియన్ భవనంలో ట్రాలీ రిక్షా యూనియన్‌లు, టైలర్ యూనియన్ సభ్యులతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ట్రాలీ రిక్షా యూనియన్ రెండు సంఘాల అధ్యక్షులు కోచెర్ల భూషయ్య, గిన్ని ఎర్రయ్య, టైలర్ యూనియన్ అధ్యక్షుడు పటన హరికృష్ణ ఏర్పాటు చేశారు. యూనియన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. సమస్యలు పరిష్కరిస్తామని సాయిరాజ్ హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ బర్ల లక్ష్మణరావు, చాట్ల తులసీదాసు, పటన నీలాద్రి, పటన కృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలం వడ్డివాడ, కాకరాపల్లి పంచాయతీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, డైరక్టర్‌లు పిలక రవికుమార్ రెడ్డి, మార్పు నాగభూషణరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్ పాల్గొన్నారు .

సోంపేట: ఇచ్ఛాపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని పిరియా విజయ ఆదివారం సోంపేట పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టి.యశోద, ఎంపిపి దాస్, సర్పంచ్ నగిరి ప్రభావతి, నాయకులు ఎం.రాజారావు, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్


ఇచ్ఛాపురం : వైసిపికి మద్దతు తెలుపుతున్న యూనియన్ నాయకులు

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి


దుర్గారావు (ఫైల్)

లావేరు: మండలంలోని చిన్నకొత్తకోట గ్రామానికి చెందిన బంటు దుర్గారావు (30) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఇదే గ్రామానికి చెందిన దూసి గణేష్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు కథనం మేరకు చిన్నకొత్తకోట గ్రామానికి చెందిన వీరు ఇద్దరు విశాఖపట్నం జిల్లా తగరపువలసలోని దివిస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న సంతోష్ వివాహానికి బైరిసింగుపురం దిచక్ర వాహనంపై వెళ్లి తిరిగి తగరపువలస వెళ్తున్న క్రమంలో లావేరు మండలం బొంతుపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్థరాత్రి ముందు వెళు న్న వాహనాన్ని తప్పించే సమయంలో వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి రహదారిపై బోల్తా పడటంతో వెనుక కూర్చున్న దుర్గారావుకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దిచక్ర వాహనం నడుపుతున్న గణేష్‌కు స్వల్ప గాయాలు కావడంతో రణస్థలంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు మృతుడు దుర్గారావు తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వామినాయుడు శవపంచనమా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతి

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయితీ బొమ్మికలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ జి.వి ప్రసాద్ ఆదివారం తెలిపారు. విచారణలో జంగాలపాడుకు చెందిన సవర చంద్రయ్య (48)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుని భార్య పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చంద్రయ్య మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. చంద్రయ్య ఈనెల 13న బంధువుల వివాహం నిమిత్తమై బొమ్మిక గ్రామానికి బయలుదేరి వెళ్లి రహదారి పక్కన తాటిచెట్ల వద్ద విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారని తెలిపారు.

చినవంక డీలరు మృతి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని చినవంక చౌక డిపో డీలర్ సొర్ర అప్పారావు (60) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆరోగ్యం క్షీణించడంతో అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు రిఫర్ చేయడంతో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆయన భార్య సరోజని, కుమారుడు పృథ్వీ తెలిపారు. 40 ఏళ్లుగా డీలరుగా సేవలందించిన వ్యక్తి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబానికి తహశీల్దారు సురేష్, డిప్యూటీ తహశీల్దార్ గిరిరాజ్, రేషన్ డీలర్ల సంఘం సభ్యులు కోనేరు కామేశ్వరరావు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సోంపేట

మండల పరిధిలోని బారువ కొర్లాం జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రాజాం గ్రామానికి చెందిన డొక్కార నాగేశ్వరరావు (50) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నాగేశ్వరరావు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు లారీ కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తిని బారువ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనపై బారువ పోలీసులు కేసు నమోదు చేశారు.

50 లీటర్ల నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలో గొల్ల బంజీరులో కార్డాన్ సెర్చ్ ఆదివారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం పరుచుకున్నారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ నల్లి సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, సెంట్రల్ పోలీస్ ఫోర్స్, పోలీసులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పదో వార్డులో ఆదివారం పలువురు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మున్సిపాలిటీలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. పారిశుధ్యం మెరుగు పరుచుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గందం కామేశ్వరరావు, దడే నర్సింహులు, కొండే నర్సింహులు, జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు: మండలం మురపాకలో టిడిపి అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. నియోజకవర్గం నుంచి 1500 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. విజయనగరం మాజీ ఎంపీ కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ఉత్తరాంధ్ర టిడిపి కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డిని గద్దెదించితే తప్ప ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, జల్లెపల్లి జనార్ధన్, మడ్డి కనకయ్య, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని పెద్ద గనగళ్లపేటకు చెందిన పలువురు మత్స్యకారులు ఆదివారం విశాఖ ఎ కాలనీలో ఉన్న టిడిపి కార్యాలయంలో ఉమ్మడి అభ్యర్థి జి.శంకర్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారిని టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


పలాస : పార్టీలో చేరిన వారితో శిరీష

ఇంటింటా ప్రచారం


ఆమదాలవలస : పార్టీలో చేరిన యువకులతో రవికుమార్


ఇచ్ఛాపురం : ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అశోక్ బాబు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి :

మండలం సౌడాం పంచాయతీలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా టెక్కలి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, టిడిపి నాయకులు గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో వైసిపి ఓటమి ఖాయమని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలో 20వ వార్డు వెంగళరావు కాలనీ, 17వ వార్డు పూజారిపేటలో జనసేన, బిజెపి కన్వీనర్లు పేడాడ రామ్మోహనరావు, పేడాడ సూరపు నాయుడుతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. అనంతరం పురపాలక సంఘ పరిధిలోని సాయినగర్‌లో మాజీ ఎమ్మెల్యే కిల్లి అప్పలనాయుడు కుమారుడు కిల్లి లక్ష్మణరావు ఆయన కుమారుడు శేషు ఆధ్వర్యంలో పురపాలక సంఘంలోని 15వ వార్డు పాతిన వారి వీధి, 17వ వార్డు పూజారిపేట అలాగే సరుబుజ్జిలు మండలంలోని మతల పేట మాజీ సర్పంచ్ బగాది ధనుంజయరావు తదితర 30 కుటుంబాలు రవికుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రామన్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువగా జరిగిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీతా సాగర్, మాజీ కౌన్సిలర్లు రెడ్డి గౌరీ, బోర గోవిందరావు, వార్డు ఇన్‌ఛార్జులు బుడుమూరు గోవిందరావు, చిగురుపల్లి వెంకటేష్, మొదలవలస రమేష్, ఎన్ని శ్రీదేవి, లంక నాగరాజు, రెడ్డి రాంబాబు, నాగళ్ల మురళీధర్ పాల్గొన్నారు.

పట్టణ పరిధిలో కృష్ణాపురంలో టిడిపి నాయకులు కూన భానోజీరావు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూన అప్పలనాయుడు, పేడాడ ముద్దు, గురుగుబెల్లి నారాయణరావు, సనపల నారాయణ మూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో ఈదుపురం పంచాయతీ పలు వీధుల్లో ఎమ్మెల్యే అశోక్ ప్రచారం నిర్వహించారు. శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి రాజు, దుర్యోధన, మంగి లక్ష్మి, దక్కత ఢిల్లీరావు, పద్మనాభం, యువరాజు పాల్గొన్నారు.

కవిటి: మండలం రాజపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ భార్య నీలోత్పల ప్రతి ఇంటికి వెళ్లి టిడివి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అశోక్ అభిమానులు పాల్గొన్నారు.


కొత్తూరు : మహిళలకు పోస్టరును అందజేస్తున్న గోవిందరావు


కవిటి : రాజపురంలో ప్రచారం చేస్తున్న రాజేష్

కొత్తూరు: మండలంలోని నివగం, మదనాపురం, సోమరాజపురం, ఆకులతంపర గ్రామాల్లో ఆదివారం పాతపట్నం టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు ఇంటింటికి వెళ్ళి ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్దించారు. కార్యక్రమంలో నాయకులు మాతల గాంధీ, ఎద్దు దాసునాయుడు, అగతముడి మాధవరావు, వి.సుధాకర్, నీలంనాయుడు తదితరులున్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాం కాలనీ, కరిమిల్లి పేటలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి జి.శంకర్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, ఉదయ్, గురు ప్రసాద్, కామేష్ వెంకీ, డివిజన్ నాయకులు గడ్డన్న, సుదర్శన్, రమణమూర్తి, రాజారావు పాల్గొన్నారు.

గార మండలం బోరవానిపేటలో తెలుగు మహిళా అధ్యక్షురాలు జి.స్వాతి ఉమ్మడి అభ్యర్థి శంకర్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పొందూరు: మండలం వీఆర్ గూడెంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ భార్య కూన ప్రమీల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు రామ్మోహన్, ఎంపిటిసి అన్నెపు కుమారి, నాయకులు సువ్వారి మధు, కె.సత్యనారాయణ, ఎ.రాము, ఎస్.శ్రీరంగ నాయకులు, శంకర భాస్కర్, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - పలాస, కొత్తూరు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలపై సిబ్బంది తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని అగ్నిమాపకశాఖ అధికారి బి.సోమేశ్వరరావు అన్నారు. స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిత్లీ తుపాను సమయంలో సిబ్బంది చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.రమేష్ నాయుడు, కె.యుగంధర్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారి బుచ్చోడు, విశ్రాంత వైద్యాధికారి పాలవలస శశిభూషణరావు వారోత్సవాలు ప్రారంభించారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైసిపిలో చేరిక

రణస్థలం: విశాఖపట్నం రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి కార్యాలయంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి సమక్షంలో మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకులు గొర్లె విజయ్ కుమార్, మండల టిడిపి ఉపాధ్యక్షులు దురగాసి రామారావు(డాక్టర్ రామారావు) వైసిపిలో చేరారు. జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కవిటి: మండలం లోళ్లపుట్టుగ కూడలిలో ప్రయాణికుల విశ్రాంతి భవనం వద్ద గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. లోళ్ల శ్రీనివాసరావు, లోళ్ల కింగ్, పూడి రామారావు, షణ్ముఖరావు, ఎన్.రమేష్, ఎన్.వెంకట రమణ, ఎన్ జగదీష్ పాల్గొన్నారు.

సానుభూతి కోసమే డ్రామా

ప్రజాశక్తి- టెక్కలి

సిఎం జగన్‌మొహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేవలం ప్రజల్లో సానుభూతి పొందడానికేనని టిడిపి నాయకులు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసిన సిఎం కుటిల బుద్ధిని, కుయక్తులను ప్రజలు గ్రహించారని, వైసిపిని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం, మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

కవిటి: సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో శవరాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే బెందాలం అశోక్ ఆరోపించారు. మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టకపోతే రాష్ట్రం భ్రష్టు పట్టిపోతుందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్ని డ్రామాలు ఆడినా, ఎన్ని కోడి కత్తి ఘాట్లు పెట్టించుకున్న ఈసారి ఎన్నికల్లో వైసిపికి ఓటమి తప్పదని ఎమ్మెల్యే జోస్యం చెప్పారు.



టెక్కలి : మాట్లాడుతున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారన్న భయంతో సానుభూతి కోసం వైసిపి నాయకులు డ్రామాలు మొదలు పెట్టారని శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, పార్టీ ఉపాధ్యక్షులు పిఎంజెబాబులు విమర్శించారు. నగరంలోని విశాఖ ఎ కాలనీలో ఉన్న నియోజక వర్గ టిడిపి కార్యాలయంలోను, జిల్లా టిడిపి కార్యాలయంలో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు.

నక్సల్బరీ ఉద్యమం దిక్సూచి

ప్రజాశక్తి- పలాస

నక్సల్ బరి శ్రీకాకుళ ఉద్యమాలు దేశానికి దిక్సూచిగా నిలబడ్డాయి. భారత వ్యవసాయక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే సాయుధ పోరాటమే సరైన మార్గమని నమ్మిన వ్యక్తి పైలా వాసుదేవరావు అని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వరరావు కొనియాడారు. మండలం మామిడిపల్లిలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైల వాసుదేవరావు 14వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్సల్ బరి స్ఫూర్తిని పొంది వీర శ్రీకాకుళం విప్లవ పోరులో ముందు వరుసలో నిలబడ్డారని, ఉద్యమం కష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టిన వ్యక్తి వాసుదేవరావు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాగర్, ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ వీరాస్వామి, వినోద్, విష్ణు, పైల చంద్రమ్మ, అరుణ, రామారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు


ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణ్ రావు అన్నారు. పొల్లాడకు చెందిన ధర్మవరపు గిరిబాబు కొన్నాళ్లుగా గుండెకి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఇటీవల మతి చెందారు. మృతునికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు ఆదివారం మృతుని కుటుంబసభ్యులను కలిసి అతని భార్య సరస్వతికి రూ.పది వేలు నగదు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మండల మహేష్, తామాడ అశోక్, చందు, గీత తదితరులు పాల్గొన్నారు.

'జ్ఞానభారతి'లో ఒరియా నూతన సంవత్సర వేడుకలు

ఇచ్ఛాపురం: స్థానిక జ్ఞాన భారతి పాఠశాలలో ఆదివారం ఒడియా నూతన సంవత్సర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్యక్షతన గణేష్ ప్రసాద్ పండ, నిత్యానంద పట్నాయక్, రాబిన్ కుమార్ పాడే, రంజన్ కుమార్ బ్రహ్మ సమక్షంలో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పనా పానకాన్ని సంప్రదాయంలో భాగంగా అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఐబి పాండా, హెడ్ మిస్ట్రెస్ రషీదాసుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ఒరియా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దానయ్యకు సన్మానం చేస్తున్న కమిటీ సభ్యులు

స్థలదాతకి సన్మానం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో అయ్యప్ప మందిరం నిర్మాణానికి సుమారు రూ.కోటి విలువైన భూమి ఇచ్చిన అనపాన దానయ్య, వారి కుమారులను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అయ్యప్ప స్వామి జన్మదినం మహోత్సవ కార్యక్రమం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆలయాల వద్ద అన్నదానం

కవిటి: మేష సంక్రమణం సందర్భంగా మండలంలోని దేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కవిటి చింతామణి అమ్మవారు, కుసుంపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లోని సింధుపురాణి అమ్మవారు, రాజపురం సంతోషి మాతా, బొరివంక కాళీ మాత, కవిటి రాజపురం మార్గంలోని కాళీ మాత ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి చింతామణి అమ్మవారి ఆలయం వద్ద పాండవ రామారావు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పలాస: మండలం నీలావతిలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సాయిరాజ్ ఆస్పత్రి సౌజన్యంతో డాక్టర్ లక్ష్మీప్రసన్న నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతరం 120 మంది రోగులకు వైద్య సేవలు అందించగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యువివి అధ్యక్షులు ఇసాకోటి జోగారావు, కుత్తుం ప్రకాశరావు, కుత్తుం వినోద్, కుత్తుం సుధాకర్, ఎంపల్ల కామేశ్వరరావు, గోరకల లోకేశ్వరరావు, సైని దేసయ్య, గీతమ్మ, పోతనపల్లి మాధవరావు, వీరాస్వామి, కూర్మారావు పాల్గొన్నారు.